RNI No. APTEL/2010/ 36692 AKSHARA PRAKASAM aksharaprakasam@gmaiil.com

అక్షర ప్రకాశం

Published From Prakasam People News Paper

సంపుటి : 15 సంచిక : 317 అక్టోబర్ 7 బుధవారం 2026 ప్రకాశం పేజీలు : 4 వెల - 2

100 కోట్ల ప్రయాణాలతో 'స్త్రీ శక్తి' చారిత్రాత్మిక ఘనత...

చంద్రబాబు హర్షం

- స్త్రీశక్తి పథకం కింద 100 కోట్లకు పైగా ఉచిత ప్రయాణాలు పూర్తి - రోజుకు సగటున 24 లక్షల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం
- ఈ పథకం ద్వారా మహిళలకు రూ.3,550 కోట్ల ఆదా జరిగిందన్న సీఎం
- మహిళలతో పాటు ఆర్టీసీ సిబ్బందికి ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందనలు

ఆంధ్రప్రదేశ్, అక్టోబర్ 6 : ఆంధ్రప్రదేశ్‌లో మహిళల కోసం ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'స్త్రీశక్తి' పథకం చారిత్రాత్మక మైలురాయిని చేరుకుంది. ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా మహిళలు 100 కోట్లకు పైగా ఉచిత బస్సు ప్రయాణాలు పూర్తి చేసుకున్నారు. ఈ ఘనత పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ఆడబిడ్డల ఆదరణ, మాతృమూర్తుల ఆమోదంతోనే ఈ విజయం సాధ్యమైందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "గత ఏడాది ఆగస్టు 15న ప్రారంభమైన స్త్రీశక్తి పథకం, 100 కోట్లకు పైగా ఉచిత ప్రయాణాలను పూర్తి చేసుకోవడం ఎంతో గర్వకారణం. రోజుకు సగటున 24 లక్షల మంది మహిళలు ఈ సదుపాయాన్ని వినియోగించుకుంటున్నారంటే ఈ పథకం వారి జీవితాల్లో ఎంతగా భాగమైపోయిందో అర్థమవుతోంది" అని తెలిపారు. చదువుకునే విద్యార్థినులు, ఉద్యోగాలకు వెళ్లే మహిళలు, రోజువారీ ఉపాధి కోసం ప్రయాణించే వారికి ఉచిత బస్సు ప్రయాణం ఎంతో శక్తినిచ్చిందని చంద్రబాబు పేర్కొన్నారు. ప్రయాణ ఖర్చుల భారాన్ని తగ్గించి, తమ అవసరాల కోసం స్వేచ్ఛగా ప్రయాణించే భరోసాను ఈ పథకం అందిస్తోందన్నారు. ఇప్పటివరకు ఈ పథకం ద్వారా మహిళలు రూ. 3,550 కోట్ల మేర ఆదా చేసుకున్నారని, ఇలా ఆదా అయిన ప్రతి రూపాయి వారి పిల్లల చదువుకు, కుటుంబ అవసరాలకు ఉపయోగపడాలన్నదే తమ ప్రభుత్వ ఆకాంక్ష అని ముఖ్యమంత్రి వివరించారు. ఈ చారిత్రాత్మక విజయాన్ని సాధ్యం చేసినందుకు రాష్ట్రంలోని మహిళలందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా, పథకం విజయవంతం కావడంలో అహర్నిశలు కృషి చేసిన ఆర్టీసీ యాజమాన్యానికి, సిబ్బందికి చంద్రబాబు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. 2024 ఎన్నికల వేళ కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో స్త్రీ శక్తి పథకం ముఖ్యమైనది. ఈ పథకాన్ని 2025 ఆగస్టు 15 నుంచి అమల్లోకి తెచ్చారు.

మోదీపై ట్రంప్‌నకు చాలా మంచి అభిప్రాయం

ఢిల్లీ, అక్టోబర్ 6 : భారత ప్రధాని నరేంద్ర మోదీపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు చాలా మంచి అభిప్రాయం ఉందని ఆస్ట్రేలియా మాజీ ప్రధాని కెవిన్ రడ్ పేర్కొన్నారు. వాణిజ్యం, రక్షణ, ఇంధనం వంటి కీలక సాంకేతిక రంగాల్లో భారత్-అమెరికా ముందుకు సాగుతున్న సమయంలో కెవిన్ రడ్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. సుంకాలు, మార్కెట్ ప్రవేశంపై చర్చలు కఠినంగా ఉన్నప్పటికీ, అమెరికాతో కొనసాగుతున్న వాణిజ్య చర్చలలో భారతదేశం సాపేక్షంగా బలమైన స్థితిలో ఉందని రడ్ అన్నారు. ఇటీవల అమెరికాలో ఆస్ట్రేలియా రాయబారిగా తన పదవీకాలాన్ని పూర్తి చేసుకున్న రడ్.. భారత్, ట్రంప్ ప్రభుత్వం మధ్య చర్చలు చురుకుగా కొనసాగుతున్నాయని, అంతిమ ఫలితం ఇద్దరు నాయకుల మధ్య రాజకీయ నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని అన్నారు. ట్రంప్‌నకు భారత్ పట్ల ఉన్న సానుకూల దృక్పథం కారణంగా, అనేక ఇతర దేశాలతో పోలిస్తే భారత్ మెరుగైన స్థితిలో ఉందని రడ్ పేర్కొన్నారు. అలాగే రష్యా-ఉక్రెయిన్ ఘర్షణలో ప్రాణనష్టం తీవ్ర స్థాయికి చేరుకుందని, దౌత్య పరిష్కారానికి దోహదపడేందుకు భారతదేశం చేస్తున్న ప్రయత్నాలను తాను స్వాగతిస్తున్నానని రడ్ పేర్కొన్నారు.

బీసీ రిజర్వేషన్ల భయంతోనే వైసీపీ కోర్టులకు వెళుతోంది

- బీసీల సంక్షేమంపై వైసీపీకి చిత్తశుద్ధి లేదన్న మండిపల్లి
- 34 శాతం రిజర్వేషన్లు కల్పించి తీరుతామన్న మంత్రి
- స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమిదే విజయమని ధీమా

అక్షర ప్రకాశం : స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతులకు (బీసీ) 34 శాతం రిజర్వేషన్లు కల్పించడం ద్వారా బీసీల రాజకీయ ప్రాతినిధ్యం పెరుగుతుందనే భయంతోనే వైసీపీ కోర్టులను ఆశ్రయిస్తోందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తీవ్రంగా ఆరోపించారు. అమరావతిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రజల్లోకి వెళ్లి పనిచేసే సత్తా వైసీపీకి లేదని, ప్రభుత్వంపై బురదజల్లడమే లక్ష్యంగా ఆరోపణలు చేయడం, కేసులు వేయడం ఆ పార్టీకి అలవాటుగా మారిందని మంత్రి విమర్శించారు. బీసీల సంక్షేమం, వారి రాజకీయ సాధికారతపై వైసీపీకి ఎలాంటి చిత్తశుద్ధి లేదని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు, రాజ్యాంగ హక్కులకు అనుగుణంగానే తమ కూటమి ప్రభుత్వం బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తోందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే 15వ ఆర్థిక సంఘం నిధులు రాష్ట్రానికి అందాయని, 'పల్లె పండుగ 3.0' కార్యక్రమం కింద గ్రామీణ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపడుతున్నామని మండిపల్లి వివరించారు. గృహ నిర్మాణం, ఉద్యానవన రంగాల అభివృద్ధికి కూడా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కూటమి పార్టీలు పూర్తి సన్నద్ధంగా ఉన్నాయని, ప్రజల మద్దతుతో వార్డు స్థాయి నుంచి మేయర్ పదవి వరకు నిర్ణయాత్మక విజయం సాధిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

తల్లిదండ్రులు లేని విద్యార్థులకు చేయూత

బాపట్ల, అక్షర ప్రకాశం : తల్లిదండ్రులను కోల్పోయి హాస్టల్లో ఉంటూ విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులకు చేయూత అందించడం సంతోషంగా ఉందని కరుణ జీవన్ మినిస్ట్రీస్ వ్యవస్థాపక అధ్యక్షులు, సామాజిక సేవకులు ఇనకొల్లు పోలీసురావు అన్నారు. బాపట్లలోని ఓప్ హాస్టల్లో ఉంటూ చదువుకుంటున్న తల్లిదండ్రులు లేని విద్యార్థులకు కేసన వెంకటేశ్వరమ్మ తన తల్లిదండ్రులు శేషు, శేషమ్మల జ్ఞాపకార్థం, అలాగే తన అక్క మునేశ్వరి కుమారుడు శేషుబాబు జ్ఞాపకార్థంగా పలు సామగ్రిని అందించారు. విద్యార్థులకు దుప్పట్లు, కొబ్బరి నూనె, పెన్నులు, బిస్కెట్లు తదితర వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇనకొల్లు పోలీసురావు మాట్లాడుతూ దాతృత్వం, సేవా దృక్పథంతో విద్యార్థులకు సహాయం అందిస్తున్న వెంకటేశ్వరమ్మ, మునేశ్వరిలను అభినందించారు. సమాజంలో ఆపన్నులకు అండగా నిలవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో భాగంగా 30 మంది విద్యార్థులకు దుస్తులు అందించారు. దాతలు కె. వెంకటేశ్వరమ్మ, ఎన్. మునేశ్వరి, ఎన్. శివాజీ, విద్యార్థులు, హాస్టల్ యాజమాన్యం పాల్గొన్నారు.

భారత వాయుసేన నూతన అధిపతిగా అశుతోష్ దీక్షిత్

అక్షర ప్రకాశం : భారత వైమానిక దళం (ఐఏఎఫ్) నూతన అధిపతిగా ఎయిర్ మార్షల్ అశుతోష్ దీక్షిత్ నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం మంగళవారం అధికారిక ప్రకటన విడుదల చేసింది. ప్రస్తుతం వైస్ చీఫ్ ఆఫ్ ఎయిర్ స్టాఫ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయన, అక్టోబర్ 31న పదవీ విరమణ చేయనున్న ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ స్థానంలో బాధ్యతలు చేపట్టనున్నారు. దీనితో ఆయన భారత వాయుసేనకు 29వ అధిపతిగా నిలవనున్నారు. నైపుణ్యం కలిగిన ఫైటర్ పైలట్ అయిన అశుతోష్ దీక్షిత్‌కు 3,500 గంటలకు పైగా యుద్ధ విమానాలను నడిపిన అపార అనుభవం ఉంది. ఆయన 1986 డిసెంబర్ 6న ఐఏఎఫ్ ఫైటర్ విభాగంలో కమిషన్ పొందారు. తన సుదీర్ఘ వృత్తి జీవితంలో మిరాజ్-2000, మిగ్ వేరియంట్లు, జాగ్వార్, కిరణ్, హాక్, తేజస్ వంటి అనేక రకాల యుద్ధ విమానాలను నడిపారు. ఆయన క్వాలిఫైడ్ ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్‌గా, ఎక్స్‌పెరిమెంటల్ టెస్ట్ పైలట్‌గా కూడా సేవలందించారు. వైస్ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టడానికి ముందు, ఆయన చీఫ్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్‌గా, సెంట్రల్ ఎయిర్ కమాండ్ చీఫ్‌గా కీలక బాధ్యతలు నిర్వహించారు.

అమరావతి పత్రికా కథనం "తెగులు బారిన వరి పంట - ఆందోళనలో మాడుగుల రైతులు" వార్తకి స్పందన: డి.గొట్టివాడలో వరి చేలను పరిశీలించిన వ్యవసాయ శాస్త్రవేత్తలు

వి.మాడుగుల, అక్షర ప్రకాశం : మండలంలో వరి పంట తెగుళ్ల బారిన పడి రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారంటూ ఈ నెల 2వ తేదీన అమరావతి, పబ్లిక్ పత్రికల్లో ప్రచురితమైన కథనాలకు వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు వేగంగా స్పందించారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని డి.గొట్టివాడ గ్రామంలో దెబ్బతిన్న వరి పొలాలను అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, కొండంపూడి కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) శాస్త్రవేత్తల బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించింది.రైతులతో మాట్లాడి పైరు పరిస్థితిని పరిశీలించిన అనంతరం శాస్త్రవేత్తలు సమస్యలకు గల కారణాలను విశ్లేషించారు. పొలాలు చదును చేసే సమయంలో లోతు మట్టిని కదిలించడం, బయట నుంచి తెచ్చిన కొత్త మట్టి వేయడం వల్ల నేల భౌతిక స్వరూపం మారి పంటకు అనుకూలంగా లేకుండా పోయిందని తెలిపారు.

దీనికితోడు ఎల్-నినో ప్రభావం వల్ల ఎదుగుదల లోపించడంతో రైతులు నాట్లు వేసిన 30 రోజుల తర్వాత జిప్సం వేశారని, అయితే సరైన సమయంలో (15-20 రోజుల్లో) వేసి నీరు పారించకపోవడం వల్ల జిప్సం ఒకచోట పేరుకుపోయి, చౌడు గాఢత పెరిగి మొక్కలు కుళ్ళిపోయాయని గుర్తించారు. దీనివల్ల పైరులో పొటాష్ లోపంతో పాటు స్వల్పంగా పాముపొడ తెగులు సోకినట్లు నిర్ధారిం చారు. తక్షణమే పొలంలోకి నీరు కట్టి, వెంటనే

తీసివేస్తూ వరుసగా మూడు రోజుల పాటు నీటిని పారించి బయటకు వదిలితే జిప్సం గాఢత తగ్గుతుంది. లీటరు నీటికి 1 మి.లీ. ప్రొపికోనజోల్ కలిపి పైరుపై పిచికారీ చేయాలి. ప్రస్తుత పంట పూర్తయిన తర్వాత పొలంలో 'జీలుగా' వంటి పచ్చిరొట్ట ఎరువులు సాగు చేసి కలియదున్నడం ద్వారా భూసారాన్ని పెంచి, చౌడు ప్రభావాన్ని తగ్గించుకోవచ్చు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి ప్రధాన శాస్త్రవేత్త (కీటక విభాగం) డా. ఆర్. సరిత, కేవీకే ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డా. ఎన్. రాజ్ కుమార్, కేవీకే శాస్త్రవేత్తలు డా. ఎన్. కిషోర్ కుమార్, డా. పి. బాబు, స్థానిక మండల వ్యవసాయ అధికారి అనసూయ పాల్గొన్నారు.

ఎం. కోడూరులో ఘనంగా అంగన్‌వాడీ ఉత్సవం

వి. మాడుగుల, అక్షర ప్రకాశం : మాడుగుల మండలం ఎం. కోడూరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం అంగన్‌వాడీ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్క రించుకుని చేపట్టిన సేవా పఖ్వాడా కార్యక్రమంలో భాగంగా బీజేపీ నాయకులు అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలో పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం వివరాలు, నాణ్యతను పరిశీలించారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మండల సంతోషి సుబ్బలక్ష్మి, వెంకటేశ్వర్లు, న్యాయవాది శ్రీరామ ప్రసాద్‌రావు, కె.ఎన్. రామకృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పుట్ట గంగయ్య, జిల్లా కార్యదర్శి గొల్లవిల్లి రాజేష్, మండల అధ్యక్షుడు మలిపాక స్వామి తదితరులు పాల్గొన్నారు.

నరసరావుపేటలో వికృత హంతకుడి అరెస్ట్: సంచలనం సృష్టించిన హత్య కేసును ఛేదించిన పల్నాడు జిల్లా పోలీసులు!

నరసరావుపేట, అక్షర ప్రకాశం : పల్నాడు జిల్లా నరసరావుపేట పట్టణంలో ఇటీవల కలకలం రేపిన దారుణ హత్య కేసును నరసరావుపేట ఒకటో పట్టణ పోలీసులు అత్యంత వేగంగా ఛేదించారు. కేసులో నిందితుడిని అరెస్టు చేయడమే కాకుండా, 2018లో జరిగిన మరో పాత హత్య కేసులో కూడా కీలక పురోగతి సాధించారు. సోమవారం సాయంత్రం నరసరావుపేటలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్ నందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పల్నాడు జిల్లా ఎస్పీ శ్రీ జగదీష్ అదహళ్లి, ఐపీఎస్ కేసు వివరాలను వెల్లడించారు.

ఘటన నేపథ్యం:

సెప్టెంబరు 29 తెల్లవారుజామున నరసరావుపేట గాంధీ పార్కు ఎదురుగా ఉన్న కాసు కాంప్లెక్స్ వద్ద నిద్రిస్తున్న గాసి రాజేష్ (35) అనే వ్యక్తిపై బండరాయితో దాడి చేసి హత్య చేశారు. అనంతరం మృతుడి ఎడమ రొమ్ము భాగాన్ని కత్తెరతో కోసి, మర్మాంగంపై ఉన్న చర్మాన్ని తొలగించి వికృతంగా ప్రవర్తించారు. ఈ దారుణంపై మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు నరసరావుపేట 1వ పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు (Cr.No: 152/2026 U/Sec 103(1) BNS) నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

పోలీసుల చురుగ్గా దర్యాప్తు – అరెస్టు:

సంఘటన ప్రాధాన్యతను గుర్తించిన జిల్లా ఎస్పీ జగదీష్ అదహల్లి ఆదేశాల మేరకు, నరసరావుపేట డీఎస్పీ ఎం. హనుమంతరావు పర్యవేక్షణలో 1వ పట్టణ సీఐ ఎస్కే టీ. ఫిరోజ్ మరియు వారి బృందం ప్రత్యేక టీమ్‌లుగా ఏర్పడ్డారు. సాంకేతిక పరిజ్ఞానం, భౌతిక సాక్ష్యాధారాల ఆధారంగా దర్యాప్తు చేపట్టి, అక్టోబరు 05న మధ్యాహ్నం 1:30 గంటలకు బరంపేటకు చెందిన నిందితుడు కసుకుర్తి నిఖిల్ (30)ని మధ్యవర్తుల సమక్షంలో అరెస్టు చేశారు. నిందితుడి వద్ద నుండి 2018 మరియు 2026 హత్యలకు ఉపయోగించిన రెండు కత్తెరలు, హత్య సమయాల్లో నిందితుడు ధరించిన రక్తపు మరకల దుస్తులను పంచుల సమక్షంలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

వికృత ఆలోచనలే హత్యలకు కారణం:

విచారణలో నిందితుడు వెల్లడించిన వివరాలు పోలీసులను దిగ్భ్రాంతికి గురిచేసాయి. ఇతరులను హత్య చేసి, వారి శరీర భాగాలను కత్తిరిస్తే తనకు బలం వస్తుందనే వికృత ఆలోచనలు, కలలు పదేపదే రావడమే ఈ దారుణాలకు కారణమని తెలిపాడు. ఒంటరిగా నిద్రిస్తున్న వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని ఈ హత్యలకు పాల్పడినట్లు నిందితుడు అంగీకరించాడు.

పోలీసు బృందానికి ఎస్పీ అభినందనలు:

సంచలనం సృష్టించిన ఈ వికృత హత్య కేసును సాంకేతిక పరిజ్ఞానంతో త్వరితగతిన ఛేదించిన నరసరావుపేట డీఎస్పీ ఎం. హనుమంతరావు, 1వ పట్టణ సీఐ ఎస్కే టీ. ఫిరోజ్, ఎస్సై వంశీకృష్ణ మరియు పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ జగదీష్ అదహల్లి ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించి ప్రశంసించారు.

మాడుగులలో అభివృద్ధి పనులకు శ్రీకారం

వి.మాడుగుల, అక్షర ప్రకాశం : అనకాపల్లి జిల్లా మాడుగుల మండలంలో మంగళవారం ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పార్థసారథి స్వామి ఆలయంలో నిర్వహించిన వరుణ యాగంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

అనంతరం పల్లె పండుగ నిధులతో రూ.50 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న మాడుగుల–కోడూరు రహదారి నుంచి పార్థసారథి ఆలయం వరకు సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో సౌర విద్యుత్ పథకం పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం అనారోగ్య బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు నందారపు సన్యాసిరావు అద్దిపిల్లి జగ్గారావు ఉందూరు దేవుడు మజ్జి లక్ష్మీ రావు బుద్ధాల రమణ తదితరులు అధికారులు ఎంపీడీవో కె అప్పారావు ఎమ్మార్వో రమాదేవి, టీడీపీ నాయకులు, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక సేవతో కూడిన శాంసన్ ప్రభుత్వ సర్వీస్ ఆదర్శనీయం

క్రోసూరు, అక్షర ప్రకాశం : వైద్య ఆరోగ్యశాఖలో 36 సంవత్సరములు ప్రభుత్వ సర్వీస్ పూర్తి చేసుకున్న సందర్భంగా క్రోసూరు పీహెచ్‌సీలో ఆరోగ్య విస్తరణ అధికారిగా పనిచేస్తున్న శిఖా శాంసన్ ను ప్రజా సంఘాలు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం పల్నాడు జిల్లా క్రోసూరులోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ డాక్టర్ బాబు జగజీవన్ రామ్ విగ్రహాల వద్ద ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శాంసన్ దివ్యాంగులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ శాంసన్ వైద్య ఆరోగ్యశాఖలో వివిధ హోదాల్లో 36 ఏళ్ల సుదీర్ఘ సేవలు అందించి ప్రజలు మన్ననలను పొందారన్నారు క్రోసూరు, సత్తెనపల్లి, ఫణి దరం, ఫిరంగిపురం, ముప్పాళ్ళ, రాజుపాలెం, బెల్లంకొండ వివిధ ప్రాంతాల్లో సమర్థవంతంగా సేవలు అందించారన్నారు.

వైద్య ఆరోగ్య శాఖలోని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు అమలు నూ క్షేత్రస్థాయిలో ప్రజల వద్దకు తీసుకొని వెళ్లి వార్తాపత్రికల ద్వారా ప్రజలకు చేరవేయటంలో దిట్ట అని కొనియాడారు ప్రత్యేకించి కోవిడ్-19 మహమ్మారి సమయంలో శాంసన్ బెల్లంకొండ మండలంలో అందించిన సేవలు అభినందనీయం అని పేర్కొన్నారు.

సామాజిక సేవా కార్యక్రమాలు జాతీయ నాయకులు వర్ధంతి పుట్టిన రోజు వేడుకలు విద్యార్థులకు ఉద్యో గులకు క్రీడా పోటీలు వకృత్వ పోటీలు నిర్వహణ క్షేత్రస్థాయిలో ఆరోగ్య అవగాహన సదస్సులు నిర్వహణ ఆయన ప్రత్యేకత అని తెలియజేశారు. ఆయన సేవలను కొనియాడారు దుశాలువా, పూల దండ, బొకేలతో జ్ఞాపికలతో ఘనం గా సత్కరించారు. ఈ కార్యక్రమంలో క్రోసూరు యార్డ్ మాజీ చైర్మన్ కాండ్రు కాశయ్య, మాజీ ఎంపీపీ అనుముల వెంకట్రామిరెడ్డి, బిజెపి అధ్యక్షులు దమ్మాలపాటి శ్రీనివాస రావు, ఏపీజీవీ కార్యదర్శి రత్తయ్య, ఏపీ ఎన్జీవో పెదకూరపాడు అధ్యక్షు లు వెంకటరావు, బిఎస్పి నాయకులు గనుపల్లి రాజశేఖర్, రిటైర్డ్ హిందీ ఉపాధ్యాయులు కర్నాటి కృష్ణారావు, షేక్ మస్తాన్ దుద్దుల యోహాన్ యార్డ్ డైరెక్టర్ సిపిఎం నాయకులు హనుమంతరావు వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అక్షర ప్రకాశం

బుధవారం 7 - 10 - 2026

ఘనంగా డాక్టర్ సింగరాజు సాయికృష్ణ 47వ పుట్టినరోజు వేడుకలు

సత్తెనపల్లి, అక్షర ప్రకాశం : పట్టణంలోని ప్రముఖ డాక్టర్ సింగరాజు సాయికృష్ణ పుట్టినరోజు వేడుకలు సాయి కృష్ణ మల్టీ స్పెషాలిటీ హాస్పిట ల్ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, పలువురు ప్రముఖులు, నాయకులు, శ్రేయోభిలాషులు, అభిమానులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ సింగరాజు సాయికృష్ణని స్థానిక శాసనసభ్యులు కన్నా లక్ష్మీ నారాయణ శాలువాతో సత్కరించి, పుట్టినరోజు శు భాకాంక్షలు తెలియ జేశారు. అనంతరం కేక్ కటింగ్, అన్నదానం తదితర సేవా కార్యక్ర మాలు నిర్వహించారు. ఎమ్మెల్యే కన్నా ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం సింగరాజు యువసేన, (వైద్యం సామాజిక సేవ, యువ సాధికారత) లోగో ను ఆవిష్కరించారు. సింగ రాజు యువసేన లోగో ఆవిష్కరణ కార్యక్రమంలో నరసరావుపేట, సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజక వర్గాల నుండి అభిమానులు వందలాది మంది పాల్గొన్నారు. తన జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాలతో జరుపుకోవడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజాసేవలో ముందుండే డాక్టర్ సాయికృష్ణ కి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా డాక్టర్ సింగరాజు సాయి కృష్ణ మాట్లాడుతూ ప్రముఖులు రాజకీయ నాయకులు అభిమానులు ఎందరో జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మరియు సోషల్ మీడియా ద్వారా తెలియజేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. పేదలకు శ్రేయోభిలాషులకు నాతో ఉండి నాతో నడుస్తూ నడిపిస్తున్న అభిమానులకు టీడీపీ, మరియు జనసేన కార్యకర్తలకు ఎప్పుడూ అందరికీ నిత్యం అందుబాటులో ఉంటానని తెలియజేశారు. జన్మదిన వేడుకలతో నాపై బాధ్యత మరింత ఇంకా పెరిగిందని ఇంకా సేవా కార్యక్రమాలు చేయాల్సిన బాధ్యత నాపై ఉందని అన్నారు. ఈ జన్మదిన వేడుకల్లో డాక్టర్లు శ్రేయోభిలాషులు, ప్రముఖులు, టిడిపి నాయకులు జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చిరుమామిళ్లలో విద్యార్థులకు క్రీడా వసతులు: నూతన రన్నింగ్ ట్రాక్‌ను ప్రారంభించిన కలెక్టర్ కృతిక శుక్లా

పల్నాడు జిల్లా, అక్షర ప్రకాశం : పల్నాడు జిల్లా చిరుమామిళ్లలోని శ్రీ నడికట్టు రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల కోసం నూతనంగా ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ రన్నింగ్ ట్రాక్‌ను పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా ఘనంగా ప్రారంభించారు. విద్యార్థుల్లో క్రీడలపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు శారీరక దారుఢ్యాన్ని మెరుగు పరచడమే లక్ష్యంగా ఈ ట్రాక్‌ను సిద్ధం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ విశేష ప్రతిభ కనబరచాలని పిలుపునిచ్చారు. చిన్ననాటి నుంచే ఆటల్లో పాల్గొనడం వల్ల శారీరక ఆరోగ్యం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని ఆమె స్పష్టం చేశారు. పాఠశాలల్లో క్రీడా మౌలిక వసతుల కల్పనకు తమ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని, ఈ నూతన రన్నింగ్ ట్రాక్‌ను విద్యార్థులు పూర్తిస్థాయి లో సద్వినియోగం చేసుకుని రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణించాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు మరియు సంబంధిత శాఖల అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చిర్రి బాలరాజుకు వినతి పత్రాలు సమర్పించిన ఆశా, అంగన్వాడీ, విభిజి రామ్‌జీ ఉద్యోగులు

ఏలూరు జిల్లా,, కుక్కునూరు,, అక్షర ప్రకాశం : పోలవరం నియోజకవర్గంలోని ఆశా వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, విభిజి రామ్‌జీకి సంబంధించిన ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించి, తమ న్యాయమైన డిమాండ్లను అమలు చేయాలని కోరుతూ మంగళవారం బర్రింకలపాడులోని పోలవరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే చిర్రి బాలరాజును కలిశారు. ఈ సందర్భంగా తమ సమస్యలు, ఉద్యోగ పరమైన ఇబ్బందులు, వేతనాలు, విధి నిర్వహణకు సంబంధించిన అంశాలు తదితర విషయాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి వినతి పత్రాలను సమర్పించారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే చిర్రి బాలరాజు సానుకూలంగా విని, వారి సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మాట్లాడుతూ.. ఆశా వర్కర్లు, అంగన్వాడీ సిబ్బంది, విభిజి రామ్‌జీకి సంబంధించిన ఉద్యోగులు ప్రజలకు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో కీలకమైన సేవలు అందిస్తున్నారని అన్నారు. వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజలకు సేవలందించే సిబ్బందికి అవసరమైన సహకారం, భరోసా అందించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. ఉద్యో గులు సమర్పించిన వినతి పత్రాల్లోని అంశాలను పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులతో చర్చించి సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చూపేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు హామీ ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో మంత్రి డ్రైవర్ శ్రీహరి దుర్మరణం

చిలకలూరిపేట, అక్షర ప్రకాశం : రోడ్డు ప్రమాదంలో మరణించిన పసుమర్రు గ్రామానికి చెందిన మంత్రి గొట్టిపాటి రవికుమార్ డ్రైవర్ తన్నీరు శ్రీహరి పార్థివదేహానికి తెలుగుదేశం పార్టీ నాయకులు నివాళులర్పించారు. నిన్న చిలకలూరిపేట పట్టణ పరిధిలోని పోలిరెడ్డిపాలెం బైపాస్ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో పసుమర్రు గ్రామానికి చెందిన తన్నీరు అంకమ్మ కుమారుడు శ్రీహరి అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరీముల్లా, రూరల్ మండల పార్టీ అధ్యక్షులు జవ్వాజి మదన్ మరియు పసుమర్రు గ్రామ నాయకులు శ్రీహరి స్వగ్రామానికి చేరుకుని, ఆయన పార్థివదేహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా నాయకులు శ్రీహరి భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తీవ్ర శోకసంద్రంలో ఉన్న కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ సానుభూతిని తెలిపారు. శ్రీహరి కుటుంబానికి పార్టీ తరపున, వ్యక్తిగతంగా ఎల్లప్పుడూ అండగా ఉంటామని నాయకులు ధైర్యం చెప్పారు. పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

Published by : Byrapuneni Srinivasarao, Door No.2-25, Vinodarayanipalem (v), Ammanabrolu (Post), N.G.Padu Mandal, Prakasam Dist. A.P. , Printed by : Nannuri Subba Rao, Trunk Road, Ongole Town & Mandal, Prakasam Dist, A.P. - 523001, Printed at : Vijaya Printers (offset Printing), Trunk Road, Ongole Town & Mandal, Prakasam Dist, A.P. - 523001, Published from : Door No.2-25, Vinodarayanipalem (v), Ammanabrolu (Post), N.G.Padu Mandal, Prakasam Dist. A.P. Editor : Byrapuneni Srinivasarao, Door No.2-25, Vinodarayanipalem (v), Ammanabrolu (Post), N.G.Padu Mandal, Prakasam Dist. A.P. Cell : 9848997263, E.mail : aksharaprakasam@gmail.com,